# వరంగల్ వాయిస్

Evening Daily

సంపుటి : 04 | సంచిక : 126
పేజీలు : 08 | వెల: రూ.5/-
శుక్రవారం
ఫిబ్రవరి 07, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


## కనీస ధర కరువాయే..

- నిండా మునుగుతున్న మిర్చి రైతులు
- మద్దతు ధర రూ.25 వేలు ప్రకటించాలి
- మార్క్ ఫెడ్, నాఫెడ్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయాలి
- రైతు సంఘం నాయకుల డిమాండ్




8లో..

## మొబైల్ కు మాత్రం మెసేజ్ లు

### రైతు భరోసాపై అయోమయం

### తప్పుడు సమాచారంతో రైతుల్లో ఆందోళన

### బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న అన్నదాతలు

### ఇబ్బందులు పడుతున్న కర్షకులు




# జమ కాలే..!

గణతంత్ర దినోత్సవం రోజున రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రైతు భరోసా పథకానికి శ్రీకారం చుట్టింది. తొలిరోజు కొన్ని గ్రామాల్లో అక్కడక్కడ కొంత మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో మాత్రమే నిధులు జమయ్యాయి. 27 వ తేదీన మండలానికి ఒకటి పైలెట్ గ్రామంగా ఎంపిక చేసి రైతుల అకౌంట్ లలో నిధులు జమ చేసింది. అనంతరం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ రావడంతో ఎలక్షన్ కమిషన్ అనుమతితో ఈ నెల ఐదున రాష్ట్ర వ్యాప్తంగా ఎకరంలోపు భూమి ఉన్న 17.03 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.1,126.54 కోట్లు జమ చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు రైతుల మొబైల్ నెంబర్ లకు మెసేజ్ కూడా వచ్చింది. దీంతో ఆశగా బ్యాంక్ కు వెళ్లిన కర్షకులకు రైతు భరోసా నిధులు జమ కాలేదన్న సమాధానం రావడంతో ఒక్క సారిగా కంగుతిన్నారు. రైతుల ఆనందం ఆవిరైంది. నిధులు జమ చేసినట్లు ప్రభుత్వం ప్రకటించి మూడు రోజులు గడుస్తున్నా రైతుల ఖాతాల్లో నిధులు జమ కాక పోవడంపై అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. ప్రభుత్వ తప్పుడు సమాచారంతో రైతులు బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. రైతు భరోసా జమ కాలే.. అంటూ రైతులు పెదవి విరుస్తున్నారు.

–వరంగల్ వాయిస్, మల్హార్




వివరాలు2లో..



2లో..

## గురుకులంలో ఫుడ్ పాయిజన్

- వాంతులు, విరోచనాలతో ఆస్పత్రికి
- మహబూబాబాద్ జిల్లా గూడూరులో ఘటన




8లో..

## ప్రారంభమైన మహా కుంభాభిషేకం

- తరలి వస్తున్న భక్తులు | పనులను పర్యవేక్షించిన కలెక్టర్
- ముగింపు కార్యక్రమానికి పోటెత్తనున్న భక్తజనం



2లో..

## వారిపై చర్యలు తీసుకోండి

- కలెక్టర్ కు అఖిలపక్ష నేతల ఫిర్యాదు
- కార్మిక భవన భూమిని పరిరక్షించాలంటూ విజ్ఞప్తి



8లో..

## డీటీసీ ఇంట్లో ఐటీ సోదాలు




2లో..

## త్యాగరాజ కీర్తనలను ఆలపించిన కలెక్టర్

- ఘనంగా విద్యారణ్య ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల స్వర్ణోత్సవ వేడుకలు
- ముఖ్య అతిథిగా హాజరైన పి.ప్రావీణ్య

# జమ కాలే..!




- మొబైల్ కు మాత్రం మెసేజ్ లు
- రైతు భరోసాపై అయోమయం
- తప్పడు సమాచారంతో రైతుల్లో ఆందోళన
- బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న అన్నదాతలు
- ఇబ్బందులు పడుతున్న కర్షకులు

**వరంగల్ వాయిస్, మల్హర్ :** బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు పథకం కింద ఎకరాకు ఏడాదికి రూ.10వేల చొప్పున పెట్టుబడి సాయమందేది. దానినే కాంగ్రెస్ సర్కారు రైతు భరోసా పథకంగా మార్చి ఏడాదికి ఎకరాకు రూ.12వేల చొప్పున పెట్టుబడి సాయమందించాలని ఇటీవల నిర్ణయించింది. అందులో భాగంగా ప్రస్తుత యాసంగి సీజన్ కు సంబంధించి ఎకరాకు రూ.6వేల చొప్పున నిధులు జమ చేస్తోంది. బుధవారం (ఫిబ్రవరి 05) వరకు ఎకరం లోపు భూమి ఉన్న 17.03 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.1,126.54 కోట్లు జమ చేసినట్లు ప్రభుత్వ వర్గాలు ప్రకటించాయి.

## ఇక్కడే తిరకాసు..

ప్రభుత్వం ప్రకటించినట్లుగానే 17.03 లక్షల మంది రైతుల మొబైల్ నెంబర్ లకు మేసేజ్ లు కూడా వచ్చాయి. మేసేజ్ లు చూసి ఆశతో బ్యాంక్ కు వెళ్లిన రైతులకు బ్యాంక్ లో రైతు భరోసా నిధులు జమ కాలేదు అని సమాధానం రావడంతో ఒక్క సారిగా రైతుల ఆనందం ఆవిరైంది. నిధులు జమ చేసినట్లు ప్రభుత్వం ప్రకటించి మూడు రోజులు గడుస్తున్న ఇంకా రైతుల ఖాతాల్లో నిధులు జమ కాక పోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఎకరం లోపు రైతులకే ఇంకా రైతు భరోసా అందక పోతే మిగతా రైతుల పరిస్థితి ఏంటి అంటూ రైతులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికే అమ్మిన సన్న ధాన్యానికి బోనస్ రాక, ఇటు రైతు భరోసా అందక రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది.

## మరో రకంగా ప్రభుత్వ ప్రకటన..

జనవరి 26న రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రైతు భరోసా పథకాన్ని ప్రారంభించింది. తొలిరోజు కొన్ని గ్రామాల్లో అక్కడక్కడ కొంత మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో మాత్రమే నిధులు జమయ్యాయి. 27 వ తేదీన మండలానికి ఒకటి పైలెట్ గ్రామంగా ఎంపిక చేసి రైతుల అకౌంట్ లలో నిధులు జమ చేసింది. అదే విధంగా ఎకరం లోపు భూమి ఉన్న 17.03 లక్షల మంది రైతుల ఖాతాల్లో ఫిబ్రవరి 5వ తేదీలోగా రూ.1,126.54 కోట్లు జమ చేసినట్లు ప్రభుత్వ వర్గాలు ప్రకటించడం వివాదాస్పదంగా మారింది. రైతుల సెల్ నెంబర్ కు మెసేజ్ వచ్చినప్పటికీ నిధులు జమకాకపోవడంతో అన్నదాతలు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. ఎప్పుడు రైతు భరోసా పడుతందా అంటూ ఆశగా చూస్తున్నారు. మొదటి విడతకే దిక్కు లేకుంటే రెండు, మూడో విడతల పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోనస్ డబ్బులతో పాటు రైతు భరోసా నిధులను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని కోరుతున్నారు.

# భూగర్భ నీటి వనరులను గుర్తించండి

- మినిస్ట్రీ ఆఫ్ అర్బన్ ఎఫైర్స్ అడిషనల్ సెక్రటరీ తారా
- ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్
- క్యాంపు కార్యాలయంలో పాల్గొన్న కమిషనర్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలో భూగర్భ నీటి వనరుల స్థాయి గుర్తించాలని కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ అర్బన్ ఎఫైర్స్ (ఎంఓహెచ్ యూఏ) అడిషనల్ సెక్రటరీ తారా సూచించారు. శుక్రవారం కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ అర్బన్ ఎఫైర్స్ ఆధ్వర్యంలో ఢిల్లీ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే క్యాంప్ కార్యాలయం నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ సెక్రటరీ మాట్లాడుతూ గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, కేంద్ర ప్రభుత్వ నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) సంయుక్త సహకారంతో దేశంలో 10 ఎంపిక చేసిన నగరాలైన విజయనగరం, భువనేశ్వర్ ఇటానగర్, బుర్ద్వాన్ కోర్బా, భోపాల్, వరంగల్, ఉన్నావ్, మైసూరు నాగ్‌పూర్ పట్టణాల్లో అమృత్ 2.0 కింద అక్విఫెర్ సస్టైనబిలిటీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఏఎస్ఎంఎస్) యొక్క మొదటి దశని ఇప్పటికే పూర్తి చేయడం జరిగిందన్నారు. నగరం యొక్క ఆధారిత శాస్త్రీయ డేటాబేస్ కొరవతో అమృత్ నగరాల్లోని పట్టణ, పెరి–అర్బన్ ప్రాంతాల కోసం అంతరిక్ష–ఆధారిత శాస్త్రీయ డేటాబేస్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సమర్థవంతమైన ప్రణాళిక ద్వారా పట్టణ జలాశయాలను సమర్థవంతంగా నిర్వహించడానికి తగిన చర్యలను చేపట్టడం, అమలు చేయడం కోసం నిర్ణయాలు తీసుకోవాలని బల్దియా పబ్లిక్ హెల్త్ కు చెందిన ఇంజనీర్లు అర్బన్ ప్లానర్ల ద్వారా పోర్టల్ ను విస్తృతంగా ఉపయోగించి సమాచారాన్ని నమోదు చేయాలని మంత్రిత్వ శాఖ సూచించింది. ఏంఓహెచ్ యూఏ, ఎన్ఆర్ఎస్ సీలు ఎంపిక చేసిన 10 నగరాల కోసం కరపత్రాలను రూపొందించిందని ఇందుకోసం ఆయా నగరాల్లో వెంటనే అవసరమయ్యే భూగర్భ రీఛార్జ్ పాయింట్‌లను గుర్తించాలన్నారు. ఇందుకు సంబంధించిన మ్యాప్‌లను సిద్ధం చేసుకోవాలని, త్వరలో అమృత్ 2.0 యొక్క షాలో అక్విఫర్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ కింద గ్రౌండ్ బ్రేకింగ్ నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈలు రవికుమార్, సంతోష్ బాబు, డీఈలు రంగా రావు, రాజ్ కుమార్, కార్తీక్ రెడ్డి, పబ్లిక్ హెల్త్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రీన్ ఫీల్డ్ హైవేకు సహకరించాలి



## జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్ వాయిస్, వరంగల్ :** గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే భూ సేకరణపై రైతులు ఎలాంటి అపోహలు చెందవద్దని, మెరుగైన పరిహారం అందించే విధంగా కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద హామీ ఇచ్చారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి గ్రీన్ ఫిల్డ్ ఎక్స్ప్రెస్ హైవే ఏర్పాట్లు, భూ సేకరణకై గీసుగొండ మండలం ఉకల్, మచ్చాపూర్, గ్రామాలకు చెందిన రైతులతో చర్చించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దేశాభివృద్ధికి రహదారులు చాలా అవసరమని, గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే ద్వారా జిల్లా అభివృద్ధి చెందుతుందన్నారు. గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే ఏర్పాటుకు రైతులు తమ భూములను అందించి సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, తహసీల్దార్ రియాజుద్దీన్, జాతీయ రహదారుల సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ దివ్య, టీం లీడర్ సంపత్ కుమార్, పర్యవేక్షకులు శ్రీకాంత్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వారిపై చర్యలు తీసుకోండి

- కలెక్టర్ కు అఖిలపక్ష నేతల ఫిర్యాదు
- కార్మిక భవన భూమిని పరిరక్షించాలంటూ విజ్ఞప్తి

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** కార్మిక భవన స్థలాన్ని కబ్జా చేసిన పెద్దపెల్లివాసి గొట్టిముక్కల నరేష్ రెడ్డి, భవనాన్ని కూల్చిన కాసం నమఃశివాయలపై చర్యలు తీసుకోవాలంటూ శుక్రవారం వరంగల్ ఆజంజహి మిల్ భూముల పరిరక్షణ జాక్ కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారదకు ఫిర్యాదు చేశారు. 75 సంవత్సరాలుగా కార్మికుల పోరాటాలకు వేదికగా నిలిచిన కార్మిక భవనానికి మున్సిపాలిటీ ఇంటి నెంబర్ ఉన్నప్పటికీ 2016లో అప్పటి వరంగల్ ఎమ్మార్వో తప్పుడు మార్గంలో మ్యుటేషన్ చేశారని ఆరోపించారు. మున్సిపల్ పరిధిలో ఇంటి నెంబర్ కలిగి ఉన్న భూములపై రెవెన్యూ అధికారులకు ఎలాంటి అధికారం ఉండదని ఆ వినతి పత్రంలో వివరించారు. మ్యుటేషన్ చేసిన రికార్డులను వెంటనే రద్దుచేసి అందుకు బాధ్యులైన గొట్టిముక్కల నరేష్ రెడ్డి తో పాటు సహకరించిన వరంగల్ తాసిల్దార్ కార్యాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా భవనాన్ని కూల్చిన నమశ్శివాయపై క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు. కార్మికులకు భవనస్థలం దక్కేలా కలెక్టర్ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఆజంజహి మిల్ భూముల పరిరక్షణ జాక్ కమిటీ కన్వీనర్ గంగుల దయాకర్, డాక్టర్ కొణతం కృష్ణ, పెరుమాళ్ల లక్ష్మణ్, కొంపెల్లి ప్రవీణ్, జి.క్రాంతి కుమార్, ఆకెన వెంకటేశ్వర్లు, గంజి సాంబయ్య, బిళ్ళ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# త్యాగరాజ కీర్తనలను ఆలపించిన కలెక్టర్

- ఘనంగా విద్యారణ్య ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల స్వర్ణోత్సవ వేడుకలు
- ముఖ్య అతిథిగా హాజరైన పి.ప్రావీణ్య

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ బాలసముద్రంలోని కాళోజి కళాక్షేత్రం ఆడిటోరియంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో విద్యారణ్య ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని గురువారం రాత్రి సంగీత, నృత్య కార్యక్రమాల్ని నిర్వహించారు. త్యాగరాజ ఆరాధన కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ముఖ్య అతిథిగా పాల్గొని హైదరాబాద్ నుంచి వచ్చిన కళాకారులతో పాటు స్థానిక కళాకారులు, కళాశాల అధ్యాపక బృందంతో కలిసి త్యాగరాజ కీర్తనను ఆలపించారు. స్థానిక కళాకారులతో పాటు హైదరాబాద్ కు చెందిన కళాకారులు త్యాగరాజ కీర్తనలను ఆలపించి సంగీత అభిమానులను అలరింపజేశారు. విద్యారణ్య ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల స్వర్ణోత్సవ వేడుకల్లో పాల్గొన్న కళాకారులందరికీ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అభినందనలు తెలియజేశారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, కళాకారులందరికీ స్వర్ణోత్సవ శుభాకాంక్షలను తెలిపారు. విద్యారణ్య ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల ప్రిన్సిపల్ నాడ్గౌడ సుధీర్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో కళాశాల అధ్యాపకులు భాస్కర్, అనుముల యోష, హైదరాబాద్ లోని తెలుగు విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఓని విజయ్ తదితరులతోపాటు కళాకారులు, సంగీత అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



# గురుకులంలో ఫుడ్ పాయిజన్

- వాంతులు, విరోచనాలతో ఆస్పత్రికి
- మహబూబాబాద్ జిల్లా గూడూరులో ఘటన

మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం దామరవంచ గురుకుల పాఠశాలలో శుక్రవారం ఫుడ్ పాయిజన్ అయింది. దీంతో పలువురు విద్యార్థులకు కడుపునొప్పి రావడంతోపాటు వాంతులు, విరోచనాలతో అస్వస్థతకు గురయ్యారు. ఇందులో 9వ తరగతి చదువుతున్న జి.సాయి ప్రసాద్, 7వ తరగతి చదువుతున్న బి.యాకుబ్, ఎల్. రాహుల్ సీరియస్ కావడంతో హుటాహుటిన గూడూరు ఏరియా హాస్పటల్ తరలించారు. వారికి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. మిగిళిన గురుకుల విద్యార్థులు స్వల్ప అస్వస్థతకు గురైనప్పటికీ ఎలాంటి ప్రమాదం లేదని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి.

– వరంగల్ వాయిస్, మహబూబాబాద్

# కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కు నిధులు

- ఒడితల ప్రణవ్ చొరవతో రూ.1.50 కోట్లు మంజూరు
- మార్కెట్ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీ రాణి-రవీందర్



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** సబ్ మార్కెట్ యార్డుగా ఉండబడిన కమలాపూర్ మార్కెట్ 2023లో జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ నుంచి విడిపోయి పూర్తిస్థాయి మార్కెట్ గా అవతరించిన తర్వాత, విభజన హామీలలో భాగంగా రాష్ట్ర మార్కెటింగ్ శాఖ నుంచి కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కు రూ. 1.50 కోట్ల నిధులు రావలసి ఉంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ నిధులు రాబట్టుటకు ఎలాంటి ప్రయత్నం చేయకుండా నిర్లక్ష్యంగా వదిలివేసింది. కమలాపూర్ మార్కెట్ కు నూతన పాలకవర్గం బాధ్యతలు చేపట్టిన తర్వాత మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీ రాణి-రవీందర్, పాలకవర్గం అట్టి నిధులు ఇప్పించుట కోసం హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జి ఒడితల ప్రణవ్ బాబును అభ్యర్థించగా ప్రణవ్ బాబు శ్రద్ధ తీసుకుని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ లతో మాట్లాడి రూ.1.50 కోట్ల నిధులను బై ఫర్ కేషన్ ఒప్పందం ప్రకారం శుక్రవారం జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ నుంచి చైర్మన్ పుల్లూరి స్వప్న-సదానందం చేతుల మీదుగా కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి-రవీందర్ లకు చెక్కు రూపంలో అందించారు. కమలాపూర్ మార్కెట్ యార్డు అభివృద్ధి కోసం చొరవ తీసుకుని ఈ నిధులు ఇప్పించిన ఒడితల ప్రణవ్ బాబుకు జమ్మికుంట మార్కెట్ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందంలకు కమలాపూర్ మార్కెట్ చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి– రవీందర్, వైస్ చైర్మన్ దేశిని ఐలయ్య గౌడ్, మార్కెట్ డైరెక్టర్లు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ నిధులను నిబంధనలకు లోబడి మార్కెట్ అభివృద్ధి కోసం వినియోగించడం జరుగుతుందని చైర్మన్ ఝాన్సీ రాణి ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మార్కెట్ కార్యదర్శి మల్లేశం, వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి, డైరెక్టర్ రాజేశ్వరరావు, కమలాపూర్ మార్కెట్ కార్యదర్శి రాజు, మార్కెట్ డైరెక్టర్లు సముద్రాల కృష్ణ, గట్టు శ్రీధర్, జనగాని శివకృష్ణ, ఆకిన పెల్లి భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే రేవూరి



**వరంగల్ వాయిస్, గీసుకొండ :** మండలంలోని గంగదేవిపల్లి గ్రామంలో లక్కమారి కాపు సంఘం భవన నిర్మాణ భూమి పూజకు పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి మాట్లాడుతూ లక్కమారి కాపు వారు వ్యవసాయ ఆధారిత కుటుంబాలపై జీవిస్తున్నారని, రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. లక్కమారి కాపు సంఘం ఫెడరేషన్ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సహకరిస్తానన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అన్ని కులాలను ప్రోత్సహిస్తుందన్నారు. అనంతరం గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచర్ల గ్రామంలో నిర్వహించిన బీరన్న దేవాలయానికి భూమి పూజలో పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. దేవాలయ నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. బీరన్న స్వామి వారి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలపై ఉండాలని కోరారు. సంగెం మండలం తీగరాజు పల్లి గ్రామంలో బాల వికాస వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మినరల్ వాటర్ ప్లాంట్ ను రేవూరి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు, మాజీ ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

# ఎస్ఐ శివకుమార్ కు అజిజుల్ హాక్ ట్రోఫీ

## అభినందించిన రాష్ట్ర, జిల్లా స్థాయి పోలీసు అధికారులు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** మహబూబాబాద్ ఫింగర్ ప్రింట్ యూనిట్ ఎస్ఐ శివకుమార్ కేంద్ర స్థాయిలో ప్రతిష్టాత్మక ఖాన్ బహదూర్ అజిజుల్ హాక్ ట్రోఫీ అందుకున్నారు. కేంద్ర హోం శాఖ సహాయక మంత్రి నిత్యానంద రాయ్ చేతుల మీదుగా ఈ అవార్డును స్వీకరించారు. ఢిల్లీ సెంట్రల్ ఫింగర్ ప్రింట్ బ్యూరో రాష్ట్రాలలోని ఫింగర్ ప్రింట్ బ్యూరోలో నియామకులైన పోలీస్ వారికి నిర్వహించే ఆల్ ఇండియా బోర్డు పరీక్షలలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఈద శివకుమార్ ఎస్ఐ ప్రథమ స్థానంలో నిలిచారు. ఇందుకు గాను నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో, న్యూ ఢిల్లీ ఆధ్వర్యంలోని సీఎఫ్ పీబీ జనవరి 30– 31వ తేదీల్లో నిర్వహించిన 25వ అఖిల భారత ఫింగర్ ప్రింట్ బ్యూరో నిర్దేశకుల సమావేశం సందర్భంగా ప్రతిష్టాత్మక ఖాన్ బహదూర్ అజిజుల్ హాక్ ట్రోఫీని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా పని చేస్తున్న నిత్యానంద రాయ్ గారి చేతుల మీదుగా అందుకోవడం జరిగింది. తెలంగాణ ఆల్ ఇండియా బోర్డు పరీక్షలో మొదటి స్థానంలో నిలిచినందుకు నేర పరిశోధన విభాగ డీజీపీ శిఖా గోయల్, రాష్ట్ర ఫింగర్ ప్రింట్ బ్యూరో డైరెక్టర్ ఎండీ తాతా రావు, మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, సబ్ ఇన్స్పెక్టర్ శివకుమార్ ను ప్రత్యేకంగా అభినందించారు.

# నులిపురుగుల నివారణపై అవగాహన అవసరం

## ◆ డాక్టర్ మెరుగు యశస్విని



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎం.జీ.ఎం. హాస్పిటల్, (పీ.పీ. యూనిట్) అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్ లో నులి పురుగుల నివారణపై మీటింగ్ నిర్వహించిన వైద్యాధికారి డాక్టర్ మెరుగు. యశస్విని అంగన్వాడీ టీచర్లకు, ఆశాలకు సిబ్బందికి శిక్షణను ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ యశస్విని మాట్లాడుతూ జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం ఈనెల10న, 17న నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన మైక్రో యాక్షన్ ప్లాన్ తయారు చేసుకున్నారు. పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడీ సెంటర్లలో విద్యార్థిని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఒక సంవత్సరం నుంచి రెండు సంవత్సరాల వయసు కలిగిన పిల్లలకు సగం టాబ్లెట్ చూర్ణం చేసి నీళ్లలో వేసి తాగించాలని, రెండు సంవత్సరాల నుంచి 19 సంవత్సరాల వయసు పిల్లలు పూర్తి ట్యాబ్లెట్ నమిలి మింగాలని కోరారు. పిల్లలలో నులి పురుగులు శరీరంలో ఉండడం వలన వారి శారీరక, మానసిక అభివృద్ధి జరగకపోవడం, నీరసంగా, రక్తహీనతతో చదువుపై శ్రద్ధ లేకపోవడం మొదలగు లక్షణాలు కనిపిస్తాయి. కాబట్టి, సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, ప్రజలలో అవగాహన కల్పించారు. జాతీయ నులిపురుగుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారి డాక్టర్ యశస్విని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ నర్మద, రామ రాజేష్ ఖన్నా, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీని కలిసిన జర్నలిస్ట్ సంఘం నేతలు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ఇటీవల నూతనంగా నియమితులైన టీయూడబ్ల్యూజే హెచ్–143 పట్టణ కమిటీ నాయకులు శుక్రవారం మహబూబాబాద్ ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావును మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. పట్టణ కమిటీ నాయకులకు ఎమ్మెల్సీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు హనుమాండ్ల రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి కరుణాకర్, ఉపాధ్యక్షులు రాసూరి లక్ష్మణ్, ఇరుకుల కిరణ్, అమ్మటి వెంకన్న, కోశాధికారి తప్పెట్ల రాజు, సహాయ కార్యదర్శులు గుంటి శ్రీధర్, బండి రాజ్ కుమార్, సభ్యులు యాకూబ్ పాషా, ఆకుల నవీన్, సీనియర్ జర్నలిస్టులు పల్లె శ్రీనివాస్, సత్యం, పురుషోత్తం పాల్గొన్నారు.

# అంధుల పాఠశాలలో పండ్లు పంపిణీ




**వరంగల్ వాయిస్, వరంగల్ :** అలయన్స్ క్లబ్ వరంగల్ డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ అలై పెంట కుమార్ కుమారుడు రాజ్‌కుమార్ పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం ఉదయం లూయిస్ అంధుల పాఠశాలలో పండ్లు పంపిణీ చేసి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ వరంగల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ అలై చిప్ప వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడుతూ పెంట రాజ్ కుమార్ పుట్టిన రోజు ఈ విధంగా అంధుల పాఠశాలలో నిర్వహించుకోవడం ఒక ఆదర్శవంతమైన ఆలోచన అని అన్నారు. అతడికి ఆ భగవంతుడు అష్టైశ్వర్యాలను, ఆయురారోగ్యాలను ప్రసాదించాలని కోరుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ కమిటీ ఛైర్మన్ అలై మంత్రి లింగమూర్తి, అలై కుసుమ లింగమూర్తి, వరంగల్ డిస్ట్రిక్ట్ మల్టిపుల్ కోఆర్డినేటర్ అలై గజ్జెల ఓంకార్ లింగం శాస్త్రి, జోనల్ ఛైర్మన్ అలై ఎండీ దస్తగిరి, క్లబ్ అధ్యక్షులు అలై దోమల నాగేందర్, పాఠశాల ఉపాధ్యాయులు ఎన్.కళ్యాణి, ఎ.మణిశంకర్, ఆర్.మానస, వి.హైమవతి, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# కందుకూరి వెంకటేశ్వర్లుకు డాక్టరేట్



**వరంగల్ వాయిస్, జనగామ :** ప్రస్తుత కాలంలో మనం వాడే శిలాజ ఇంధనాల వల్ల భూ వాతావరణం కలుషితమవుతుంది. ముఖ్యంగా వాతావరణంలోకి కార్బన్ డై ఆక్సైడ్ విడుదల కావడం వల్ల భూ వాతావరణం వేడెక్కి పోతుంది. గ్లోబల్ వార్మింగ్ వల్ల అనేక నష్టాలు ఉన్నాయి. దీనిని తగ్గించడానికి "స్టడీస్ ఆన్ మీథేన్ డీ కంపోజిషన్ ఓవర్ నికెల్ బేస్డ్ హెటిరోజినెస్ కాటలిస్ట్స్ ఫర్ మాలిక్యులర్ హైడ్రోజన్ ప్రొడక్షన్." అనే అంశంపై పరిశోధన చేసి తక్కువ ఖర్చుతో "ఫ్యూయల్ ఆఫ్ ది ఫ్యూచర్" అయిన శుద్ధ హైడ్రోజన్ ఉత్పత్తిపై చేసిన పరిశోధనకు గాను జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ మండలం చాగల్లు గ్రామానికి చెందిన కందుకూరి వెంకటేశ్వర్లు అసిస్టెంట్ ప్రొఫెసర్ కు తెలంగాణ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ ప్రదానం చేయడం జరిగింది. వీరు ప్రస్తుతం ఆలేర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా విధులు నిర్వహిస్తున్నారు. వీరి రీసెర్చ్ సూపర్ వైజర్ డాక్టర్ వాసం చంద్రశేఖర్, డిపార్ట్ మెంట్ ఆఫ్ ఫార్మసిటికల్ కెమిస్ట్రీ, తెలంగాణ విశ్వవిద్యాలయం డిచ్ పల్లి, నిజామాబాద్ లో ఫైనల్ వైవాకు ప్రొఫెసర్ ఎస్.జ్యోతి, ప్రిన్సిపాల్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, కాకతీయ విశ్వవిద్యాలయం ఎక్స్టర్నల్ ఎగ్జామినర్ గా వ్యవహరించారు. జనగామ జిల్లాకు చెందిన వెంకటేశ్వర్లుకు డాక్టరేట్ రావడం పట్ల ఆయన స్నేహితులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయం

**టీఎస్ జేయూ రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తం గౌడ్**

**ఉచిత ప్రమాద బీమా పత్రాలు అందజేత**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద చేతుల మీదుగా జర్నలిస్టులకు ఉచిత ప్రమాద బీమా పత్రాలు అందజేశారు. తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ (TSJU)ఆధ్వర్యంలో, జర్నలిస్టులకు ఐదు లక్షల రూపాయల ఉచిత ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తం గౌడ్ నారగోని తెలిపారు. శుక్రవారం వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద చేతుల మీదుగా జర్నలిస్టులకు బీమా పత్రాలు అందజేశారు.

# రమాబాయి అంబేద్కర్ సేవలు మరువలేనివి



**వరంగల్ వాయిస్, గణపురం :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సతీమణి రమాబాయి అంబేద్కర్ జయంతిని శుక్రవారం మండల కేంద్రంలో అంబేద్కర్ వాదులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు శనిగరపు రాజేందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రమాబాయి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనతరం అంబేద్కర్ సంఘం నేతలు పలువురు మాట్లాడుతూ మహా మేధావి అంబేద్కర్ కు రాజ్యాంగ రచనల్లో రమాబాయి ఎంతో సహకారం అందించారని తెలిపారు. కాగా ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యక దేశమైన భారతదేశ మనుగడకు ఆమె అందించిన అమూల్యమైన సేవలు మరువలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎర్ర స్వామి, ఏ మల్లికార్జున్, బి.పున్నం, శ్రీకాంత్, రమేష్, సోలెమన్, ఎమ్మార్పీఎస్ నాయకులు సీహెచ్ దయాకర్ తదితరులు మాట్లాడారు.

# బాధితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని నిరుపేద కుటుంబానికి చెందిన తోట రవి పని నిమిత్తం బైక్ పై వెళ్తుండగా ప్రమాదవశాత్తు లారీ ఆక్సిడెంట్ లో అతని రెండు కాళ్లు నుజ్జు నుజ్జు కావడంతో అతడిని వెంటనే హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి డాక్టర్లు అతడి వైద్యానికి చాలా డబ్బులు ఖర్చవుతాయని చెప్పడంతో కుటుంబం దాతల సహకారం కోరింది. ఈ విషయం తెలుసుకున్న ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతీ వారి కుటుంబానికి భరోసా కల్పించి వారికి రూ.5000 ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే భవిష్యత్తులో అతడికి ఏదైనా షాపు పెట్టించి జీవనోపాధి కల్పించి వారి కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో చీమల రాజు, మాచర్ల రాజేందర్, గుడాల రమేష్, ఫౌండేషన్ యూత్ ఇంచార్జి చింతకింది రాజు, ఫౌండేషన్ డైరెక్టర శీలం అనిల్, ఫోటోగ్రాఫర్ బల్ల సంపత్, కానిగంటి కిరణ్, ప్రవీణ్, తదితర సభ్యులు పాల్గొన్నారు.

# వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ వరంగల్ ఉమ్మడి జిల్లా కమిటీ నియామకం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ ఇంటర్నేషనల్ కమిటీ కార్యవర్గ సమావేశం అధ్యక్షుడు బి సురేష్ లాల్ అధ్యక్షతన శుక్రవారం కాకతీయ విశ్వవిద్యాలయం అర్ధశాస్త్ర విభాగంలో జరిగింది. సమావేశంలో సంస్థ చేపట్టబోయే అనేక విషయాలను విస్తృతంగా చర్చించారు. సంస్థ బలోపేతానికి రాష్ట్ర వ్యాప్తంగా పూర్వ ఉమ్మడి జిల్లాల ఆధ్వర్యంలో కమిటీలు వేయాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. అందులో భాగంగా వరంగల్ ఉమ్మడి జిల్లాలో నూతన కమిటీలను నియమించారు. వరంగల్ ఉమ్మడి జిల్లాకు అధ్యక్షులుగా ఆచార్య రవికుమార్ వెల్దండి, ప్రధాన కార్యదర్శిగా పరుశరాములు మండల, మహిళా విభాగానికి అధ్యక్షులుగా సంయుక్త పొన్నాల, ప్రధాన కార్యదర్శిగా సరళ పగడాలను నియమిస్తూ సంస్థ చైర్మన్ మొహమ్మద్ సిరాజుద్దీన్, ఇంటర్నేషనల్ అధ్యక్షులు ఆచార్య బి.సురేష్ లాల్ వారికి ఉత్తర్వులు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో సంస్థ నిబంధనలకు అనుగుణంగా వరంగల్ ఉమ్మడి జిల్లాలో విస్తృత కార్యక్రమాలు చేపడుతామన్నారు. నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో పూర్తి కమిటీని ఏర్పాటు చేసుకుంటామన్నారు. సంస్థ తరపున ఉమ్మడి వరంగల్ జిల్లా మేధావులతో త్వరలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్, నాయకులు ఆచార్య కొక్కొండ విజయబాబు, ఘంటా రామిరెడ్డి, పొన్నాల రామ్మోహన్, కాజీపేట పురుషోత్తం, ప్రగల్లపాటి రాజ్ కుమార్, బిట్టవరం శ్రీమన్నారాయణ, మైస ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.

# మన రాష్ట్రం.. మన సినిమా

**సకల కళా సాంస్కృతిక మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు గడ్డం సుధాకర్**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రాష్ట్రంలోని సినిమా పరి శ్రమకు చెందిన వివిధ సినిమా అసోసియేషన్స్ పేర్లను తెలుగు సినిమా అసోసి యేషన్స్ మార్చి ఏర్పాటు చేసుకున్న బోర్డులు తక్షణమే తొలగించాలని సకల కళా సాంస్కృతిక మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు గడ్డం సుధాకర్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం గద్దరన్న అవార్డులను బేషరతుగా ఒప్పుకొని తీసుకోవాలన్నారు. గద్దరన్న పేరున ఇచ్చే ప్రభుత్వ అవార్డులను బహిష్కరించి మీకు మీరే తెలుగు అసోసి యేషన్స్ పేరున అవార్డుల ప్రదానోత్సవం చేసుకుంటామని ప్రకటించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. చట్ట వ్యతిరేకమైన చర్యగా, తెలంగాణ రాష్ట్ర అస్తిత్వాన్ని, స్వాభి మానాన్ని సినిమా ఇండస్ట్రీలోని కొంత మంది పెద్దలు పని గట్టుకొని అవమానిస్తున్నారని భావించాలిసి వస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉనికిని, గద్దరన్న గౌరవాన్ని కించపరిచే సినిమా పెద్దల వ్యవహా రాన్ని తెలంగాణ కళాకారులు, తెలంగాణ ఉద్యమకారులు, తెలంగాణ సబ్బండ వర్గాల ప్రజలు అవమానంగా భావిస్తున్న పద్ధతి మార్చుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణమే తెలంగాణ రాష్ట్రం లో వివిధ సినిమా అసోసియేషన్స్ కార్యాలయాలకు ఉన్న తెలుగు పేరును మార్చి తెలంగాణ రాష్ట్ర అసోసియేషన్స్ గా తక్షణమే బోర్డుల మార్చాలన్నారు.

# డోర్నకల్ ఉస్మానియా మస్జిద్ కమిటీ ఎన్నిక

**అధ్యక్షుడిగా సలీం**



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** స్థానిక మున్సిపాలిటీలోని ఉస్మానియా ఏ మజీద్ కమిటీ అధ్యక్షుడిగా మహ్మద్ సలీం పాషాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం ప్రార్థన తర్వాత జరిగిన సమావేశంలో తెలంగాణ రాష్ట్ర వక్ బోర్డ్ అధ్యక్షులు మహ్మద్ అసదుల్లా అందించిన ప్రొసిడింగ్ ద్వారా ఈ ఎన్నిక జరిగిందని ముస్లిం మైనారిటీ సోదరులు, మత పెద్దలు ఈ విషయాన్ని వెల్లడించారు. ఉపాధ్యక్షులుగా మహ్మద్ ముస్తాక్, జనరల్ సెక్రెటరీగా మహ్మద్ సర్వర్, సహాయ కార్యదర్శిగా మహ్మద్ సమ్ముల్లా, కోశాధికారిగా షేక్ అబ్దుల్లా, యూసుఫ్, మెంబర్లుగా ఖాదర్ బాబా, గౌస్, అజీమ్, అహ్మతుల్లా, రఫీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సలీం మాట్లాడుతూ తనను ఏకగ్రీవంగా ఎన్నుకోవడానికి సహకరించిన డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్ర నాయక్, ప్రభుత్వ ఉత్తర్వులు అందించిన వక్స్ బోర్డ్ కమిటీ సభ్యులుల ముస్లిం మైనార్టీ సహోదరులకు ధన్యవాదాలు తెలిపారు.

# వైభవంగా చెన్నకేశవ స్వామికి అభిషేకం



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం నీరుకుళ్ల గ్రామంలోని చెన్నకేశవ స్వామి వారి ఆలయంలో దుబాసి మానస–నవీన్ దంపతులు శుక్రవారం స్వామివారికి అభిషేకం నిర్వహించారు. ఈ నెల 8న శ్రీ దేవి–భూదేవి సమేత చెన్నకేశవ స్వామి కళ్యాణ మహోత్సవం ఘనంగా జరపనున్న నేపథ్యంలో స్వామివారిని దర్శించుకున్నారు. శనివారం కన్నుల పండుగగా జరిగే చెన్నకేశవ స్వామి కళ్యాణ మహోత్సవంలో ప్రజల అధిక సంఖ్యలో.. సకుటుంబ సపరివారం సమేతంగా విచ్చేసి, స్వామి వారి ఆశీర్వాదాలు పొంది, తీర్థప్రసాదాలు స్వీకరించాలని దుబాసి మానస నవీన్ దంపతులు పిలుపునిచ్చారు. స్వామివారి కల్యాణ మహోత్సవం సందర్భంగా విచ్చేసి భక్తుల కోసం అన్నదానం కార్యక్రమం చేయనున్నట్టు వారు వెల్లడించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ మహిమాన్వితమైన శ్రీ చెన్నకేశవ స్వామి వారిని అందరూ దర్శించుకోవాలన్నారు. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మార్గదర్శనంలో భక్తి మార్గంలో ముందుకు వెళ్తున్నట్టు తెలిపారు. ప్రస్తుత ఉరుకుల పరువుల జీవనంలో ప్రతి ఒక్కరికి ఆధ్యాత్మిక చింతన అత్యవసరమని, దైవచింతనతో ప్రశాంతత చేకూరుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# దంత అసుపత్రి ప్రారంభం



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** ఎటువంటి దంత సమస్య ఉన్న వైద్యం ద్వారా పరిష్కరించుకోవాలని ప్రముఖ వైద్యులు దడిగల శరత్, ధరావత్ మహేష్ లు కోరారు. డోర్నకల్ పట్టణంలో నూతనంగా దంత వైద్య ఆసుపత్రిని శుక్రవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డోర్నకల్ పట్టణంలో నూతనంగా దంత వైద్య ఆసుపత్రిని ఏర్పాటు చేశామన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న ప్రజలు దంత సమస్యలు ఎదుర్కొంటున్నట్లైతే అందరికి అందుబాటులో ఉన్న వీరభద్ర ఆసుపత్రిలో చికిత్స పొందాలని కోరారు. తక్కువ ఫీజుతో వైద్యం అందించే తమను సంప్రదిస్తే దంత సమస్యల విముక్తికి చికిత్స అందిస్తామని వివరించారు. ఈ అవకాశాన్ని ఈ ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. నారాయణ, రాజేందర్, నాగరాజు, సంగం నాగరాజు, కానుగంటి వీరన్న, కొత్త యాకన్న పాల్గొన్నారు.

# అమెరికా దుశ్చర్యలపై ప్రధాని మోడీ నోరు విప్పాలి

- బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి



**వరంగల్ వాయిస్, నర్సంపేట :** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఉన్నత విద్య కోసం వెళ్లిన భారత విద్యార్థులపై అక్రమ వలసలు అంటూ చేస్తున్న దుశ్చర్యలపై భారత ప్రధాని నరేంద్ర మోడీ నోరు విప్పాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని మేరు సంఘం భవన్ లో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ విదేశీ ఉన్నత విద్య కోసం భారత దేశం అమెరికాతో స్నేహ సంబంధాలు కలిగి ఉందని, కానీ డోనాల్డ్ ట్రంపు వచ్చిన తరువాత అక్రమ వలసలు అంటూ విద్యార్థులకు సంకెళ్లు వేస్తూ కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడటం సరైనది కాదన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ అమలు కోసం తీర్మానం పెట్టి అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ కులగణన సరిగ్గా జరగలేదని, సర్వే నిష్పక్షపాతంగా దాపరికం ఉండకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అన్యాయం జరిగిందని బీసీ జనాభా ఎంత ఉంటే అంత రిజర్వేషన్ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎస్సీ వర్గీకరణ అనేక పోరాటాలు చేస్తే సాధించిన వర్గీకరణ అని, బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరిగేటట్టు చూడాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసే దిశగా పనిచేయాలని కోరారు. ఇళ్ల స్థలాల కోసం 8 ఏళ్లుగా సీపీఐ నర్సంపేటలో పోరాటం కొనసాగించిందని, రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల స్థలాలు లేని పేద ప్రజలు గుడిసెలు వేసుకున్న ప్రతి కుటుంబానికి ఇంటి స్థలాల పట్టాలి ఇచ్చి ఇండ్లు కట్టించే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలన్నారు.

## ఉమ్మడి వరంగల్ అభివృద్ధిపై నిర్లక్ష్యం వీడాలి

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధి నిర్లక్ష్యం చేస్తూ రెండో రాజధాని చేస్తామంటూ కాలయాపన చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. శుక్రవారం నర్సంపేట పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమాజంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డితో కలిసి శ్రీనివాసరావు మాట్లాడారు. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధి చేసేందుకు గిరిజన విశ్వవిద్యాలయం, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయన్నారు. రెండో రాజధాని వరంగల్ అంటూ రాష్ట్ర ప్రభుత్వం ఏమి ఒరగబెట్టిందని, వరంగల్ అభివృద్ధి కావాలంటే ప్రణాళిక సిద్ధం చేసి విడుదల చేయాలన్నారు. వరంగల్ జిల్లా అభివృద్ధి చెందాలంటే ప్రాజెక్టులు పరిశ్రమలు రావాలని లేకుంటే సీపీఐ భవిష్యత్తులో ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధి కోసం పోరాటం చేస్తుందని తెలిపారు.

# విద్యాశాఖపై డీఈఓ సమీక్ష సమావేశం




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా విద్యాశాఖపై ప్రధానోపాధ్యాయులు, ప్రోగ్రాం ఆఫీసర్స్, ఎంఈఓలతో జూమ్ ద్వారా జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.రవీందర్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్ మొదటి అంతస్తులోని జిల్లా విద్యా శాఖ అధికారి కార్యాలయం నుంచి జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలతో, విద్యా శాఖ ప్రోగ్రాం అధికారులతో పదవ తరగతి లో ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఐఎఫ్పీ ప్యానల్స్ ని పూర్తిగా వినియోగించుకోవాలి సూచించారు. తక్కువ మార్కులు వస్తున్నటువంటి విద్యార్థులు కృంగిపోకుండా తల్లిదండ్రులతో మాట్లాడి కౌన్సిలింగ్ ద్వారా వారి ప్రదర్శన మెరుగుపడే విధంగా ప్రయత్నం చేయాలన్నారు. ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపీలలో విద్యార్థుల బేస్ లైన్, మిడ్ లైన్ ఫలితాలను నమోదు చేయడం త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పర్ఫామెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ దేశవ్యాప్తంగా పాఠశాలల ప్రతిభ, విద్యార్థుల అభ్యాసన ఫలితాలు అదేవిధంగా ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇతర అంశాల ద్వారా గుర్తించే వాటిలో మన మహబూబాబాద్ జిల్లా Prachesta-1లో ఉందని, దాన్ని ఇంకా మెరుగుపరిచి దక్ష ( Daksha) స్థానంలో ఉంచాల్సిందిగా జిల్లా విద్యాశాఖ అధికారి ప్రధానోపాధ్యాయులందరిని కోరారు. ఈ కార్యక్రమంలో కోర్స్ కోఆర్డినేటర్ గా మైదానం చంద్రశేఖర్, ఆజాద్ క్వాలిటీ కోఆర్డినేటర్, అదేవిధంగా అప్పారావు డిస్టిక్ సైన్స్ ఆఫీసర్ వ్యవహరించారు.

# ఫ్లైఆక్సిస్ అబ్రాడ్ ఎడ్యుకేషన్ ను ప్రారంభించిన విష్ణువర్ధన్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 6వ డివిజన్ లో నూతనంగా ఏర్పాటు చేసిన "ఫ్లైఆక్సిస్ అబ్రాడ్ ఎడ్యుకేషన్ " ను విశిష్ట అతిథులుగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి అల్లుడు యువజన నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొని ప్రారంభించారు. అనంతరం నియోజకవర్గ పరిధిలో జరిగిన పలు వివాహ వేడుకలలో హాజరై నూతన వధువు వరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమాలలో వారి వెంట స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అన్ని దానాలకన్నా అన్నదానం గొప్పది

- చక్రి ఫౌండేషన్ సీఈఓ దేవిక




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అన్ని దానాలకన్నా అన్నదానం గొప్పదని చక్రిఫౌండేషన్ సీఈఓ లయన్ చెట్టిపల్లి దేవిక అన్నారు. శుక్రవారం వడ్డెపల్లిలోని సహృదయ వృద్ధాశ్రమంలో తన పుట్టినరోజును ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు భోజనాన్ని సమకూర్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చక్రి ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వృద్ధాశ్రమాలలో ఉన్న వృద్ధులకు కావాల్సిన బట్టలను, ఇతర అవసరాలను తీర్చడంలో తాము ముందు ఉంటున్నామన్నారు. చలికాలంలో రోడ్డు పక్కన ఉన్న నిర్భాగ్యులకు రగ్గులను పంపిణీ చేసినట్లు తెలిపారు. అలాగే తమ ఇంట్లో ఎవరి పుట్టినరోజైనా వృద్ధాశ్రమంలో జరుపుకోవడం జరుగుతుందని తద్వారా తమకు మానసిక సంతృప్తిని కలిగిస్తుందని తెలిపారు. తమ ఫౌండేషన్ ద్వారా పిల్లలను ప్రోత్సహించడంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో ఆగస్టు 26న జరిగిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు షీల్డులు పంపిణీ చేశామన్నారు. పిల్లలలో ఉన్న సృజనాత్మకతను వెలికి తీస్తున్న ఉపాధ్యాయుల పాత్ర గొప్పదని వారికి తోడుగా తమ వంతుగా తమ ఫౌండేషన్ ద్వారా సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. నిత్యం ఆరోగ్య సమస్యతో బాధపడుతున్న వారికి చక్రి ఫౌండేషన్ ద్వారా బీపీ షుగర్ పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే వాకర్స్ అసోసియేషన్ వారి సహకారంతో కంటి పరీక్షలు, బీపీ షుగర్ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. తమ పుట్టిన రోజును ఇలా వృద్ధాశ్రమంలో జరుపుకోవడం తనకు ఎంతగానో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చక్రి ఫౌండేషన్ సభ్యులు పాల్గొని వృద్ధులకు భోజనాలు పెట్టారు.

# పీడీఎస్ యూ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఎన్నిక



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఫిబ్రవరి 4, 5 తేదీలలో భద్రాచలం పట్టణంలో జరిగిన పీడీఎస్ యూ తెలంగాణ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ లో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఐదుగురు నాయకులు రాష్ట్ర కమిటీలోకి ఎన్నిక కావడం జరిగింది. ఇందులో బి.నరసింహారావు (కేయూ రీసెర్చ్ స్కాలర్) రాష్ట్ర ఉపాధ్యక్షులుగా, అలువాల నరేష్ (ఎమ్మెస్సీ సైకాలజీ, కేయూ) వరంగల్, కావ్య(కేయూ), బొట్ల రాకేష్ (జేఎన్ టీయూహెచ్) మహబూబాబాద్, పి.అనూష( కేయూ)లు రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల, మతాలకతీతంగా దేశంలోని విద్యార్థులందరికీ ఉచిత నాణ్యమైన సమాన విద్య సాధన కోసం, విద్యా రంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల రద్దు కోసం, ప్రభుత్వ విద్యారంగా పరిరక్షణే ధ్యేయంగా, కుల, మత, ఆర్థిక అసమానతలు లేని సమానత్వ సమాజ స్థాపనే ధ్యేయంగా పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. విశ్వవిద్యాలయాల్లో అడ్మిషన్ పొందిన ప్రతి విద్యార్థికి హాస్టల్ వసతి, ప్రతి ఒక్క రీసెర్చ్ స్కాలర్ కు ఫెలోషిప్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయాల మనుగడను, స్వయం ప్రతిపత్తిని దెబ్బతీస్తున్న మోడీ ప్రభుత్వ విధానాలపై పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. పీడీఎస్ యూ తెలంగాణ రాష్ట్ర కమిటీలోకి ఎన్నిక అయ్యేందుకు సహకరించిన పీడీఎస్ యూ జాతీయ నాయకులు పెద్దింటి రామకృష్ణ, నామాల ఆజాద్ లతో పాటు ప్రస్తుతం నూతన రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటీ పృథ్వీ, ప్రధాన కార్యదర్శి ఎస్.అనిల్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# కంప్యూటర్ ఆపరేటర్ల వేతన వెతలు



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని పలు గ్రామపంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లకు నాలుగు నెలలుగా వేతనాలు అందక కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన చెందుతున్నారు. జిల్లాలో 51 మంది కంప్యూటర్ ఆపరేటర్లు జీపీ, ఎంపీడీవో కార్యాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లకు నెలకు ఒక్కొక్కరికి రూ. 22750/- చొప్పున వేతనాలు చెల్లిస్తుండగా, నాలుగు ఐదు నెలలుగా సుమారు రూ. లక్ష నుంచి రూ. లక్ష 20 వేల వేతనాలు చెల్లించక పోవడంతో అప్పులు చేయవలసి వస్తుందని చెబుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని, గ్రీన్ చానల్ ద్వార వేతనాలు చెల్లించాలని మండల కంప్యూటర్ ఆపరేటర్లు ఎండీ ఆసిఫ్, సాగర్ లు ప్రభుత్వాన్ని కోరారు.

# సీఐ సీతారెడ్డిని సస్పెండ్ చేయాలి

## బేడ బుడిగ జంగం ఐక్యవేదిక డిమాండ్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** దళిత న్యాయవాది గంధం శివపై ఆకారణంగా దాడి చేసి గాయపర్చిన హనుమకొండ ట్రాఫిక్ సీఐ సీతారెడ్డి, ఎస్సైలు యుగేందర్, ఫసియొద్దీన్, కానిస్టేబుల్ రమేష్, ఇతర కానిస్టేబుల్ లను తక్షణమే సస్పెండ్ చేయాలని బేడ బుడిగ జంగం ఐక్య వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ పత్రి రాజ పోషాలు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏనుమాముల, బాలాజీనగర్ సర్కిల్ లో గంధం శివపై జరిగిన దాడి విషయంలో సీఐ, ఇతర సిబ్బందిపై కేసు నమోదు చేసినప్పటికీ వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకోకపోవటం బాధాకరమని అన్నారు. పోలీస్ డిపార్ట్ మెంట్ వారు వారిని సస్పెండ్ చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బేడ బుడగ జంగం నాయకులు పత్రి సుభాష్, జడల జలపతి, బీబీజే నాయకులు గంధం పరమేశ్వర్, పస్తాం సతీష్, మధు, లోకేష్, సురేష్, సారమ్మ, తూర్పటి భాగ్యలక్ష్మి, భాగ్యమ్మ, సమ్మయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

# విద్యా రంగ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు
- మహబూబాబాద్ జిల్లా 4వ మహాసభలు ప్రారంభం




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు విమర్శించారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సీతారామయ్య ఏచూరి నగర్ ప్రాంగణంలో జరిగిన ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా నాలుగో మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రూ.8500 కోట్ల పెండింగ్ స్కాలర్ షిపులు ఉన్నా సరే రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్య రంగా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్, మహబూబాబాద్ జిల్లా కన్వీనర్ పట్ల మధు, జిల్లా కో కన్వీనర్లు సూర్యప్రకాష్, జ్యోతిబసు, జిల్లా నాయకులు సింహాద్రి, పవన్, మౌలానా, మహేష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## మెనూ ప్రకారం భోజనం అందించాలి

### కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**వరంగల్ వాయిస్ డోర్నకల్ :** కురవి మండలం గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలను శుక్రవారం జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్లోని డైనింగ్ హాల్, క్లాస్ రూమ్లు, పరిసరాలు, స్టోర్స్, వంట గదులను స్వయంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనాన్ని పరిశుభ్రంగా అందించాలన్నారు. ఎటువంటి నిర్లక్ష్యం వహించకుండా పిల్లలకు స్వచ్ఛమైన, రుచికరమైన ఆహారం అందించాలని వంట చేసే సిబ్బంది పరిశుభ్రంగా చేతులు కడుక్కొని ఆహార పదార్థాలను సిద్ధం చేయాలన్నారు. విద్యార్థులకు వండిన వంటలను స్వయంగా తిని పరిశీలించారు. స్వచ్ఛమైన తాగు నీరు అందించాలని, నిరంతరం విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకోవాలని, ప్రతి విద్యార్థినీ, విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత, మానసిక వికాసం కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించి వారిని గమనిస్తూ అవగాహన కల్పించాలన్నారు. షెడ్యూల్ ప్రకారం వారికి వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రతి సబ్జెక్టుపై ఎలాంటి సందేహాలు ఉన్న సమాధానాలు చెబుతూ విద్య బోధనలు అందించాలని సూచించారు. వసతి గృహాలలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వార్డెన్లు, ప్రిన్సిపాల్, ఆర్సీఓలు, నిత్యం గమనిస్తూ ఉండాలని అన్నారు.

## నడికూడ ఉన్నత పాఠశాలలో డీఈఓ వాసంతి ఆకస్మిక తనిఖీ



**వరంగల్ వాయిస్, నడికూడ :** స్థానిక ఉన్నత పాఠశాలలో హనుమకొండ జిల్లా విద్యాశాఖాధికారి వాసంతి ఆకస్మికంగాతనిఖీ చేశారని ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు దొంతుల శ్రీనివాస్ తెలిపారు. అకస్మిక తనఖీలో భాగంగా 10వ తరగతి విద్యార్థులకు ఉదయం. స్టడీ అవర్స్ సమయంలో ఆ పాఠశాలకు ఉదయం 8 గంటల 25 నిమిషాలకు వచ్చారు. విద్యార్థులతో సమావేశమై వేక్ అప్ కాల్స్ చేస్తున్నారా, ఎస్సెస్సీ స్పెషల్ టెక్స్ట్ పేపర్లు దిద్దారా అన్ని విషయాల మీద సమగ్రంగా చర్చించారు. పాఠశాల ప్రార్థనా సమయంలో తన సందేశాన్ని ఇచ్చారు. విద్యార్థులందరు ఉత్తర్ణులు కావాలని, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై ఎల్ఐపీ మిర్టెస్ట్ గురించి, ఎస్సెస్సీ విద్యార్థుల గురించి, ఏఏపీసీ గ్రాంటుల గురించి, పాఠశాల గ్రాంటు గురించి ఆరా తీశారు. గ్రంథాలయం రికార్డులు చూసి ఉపాధ్యాయులను ప్రశంసించారని పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు దొంతుల శ్రీనివాస్ తెలిపారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు జయ, శివచేతన్, శ్రవణ్ కుమార్, సుబాని, జ్యోత్స్న, శారద, అశోక్ ఉపనేద్ర పాల్గొన్నారు.

## పదవీ విరమణ చేసిన హోంగార్డ్ ను సత్కరించిన సీపీ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సుధీర్ఘ కాలం వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో హోంగార్డ్ విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన హోం గార్డ్ సుదర్శన్ ను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ శుక్రవారం సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. భవిష్యత్ లో ఆరోగ్య పట్ల శ్రద్ధ వహించాలని సీపీ పదవీ విరమణ చేసిన హోం గార్డ్ కు సూచించారు. అదనపు డీసీపీ సురేష్ కుమార్, ఏసీపీ నాగయ్య, ఆర్ఐ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## అరూరి వెంకటమ్మ మృతిపై ఎమ్మెల్యేల సంతాపం

### చిత్రపటానికి కేఆర్ నాగరాజు, నాయిని ఘన నివాళి



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ తల్లి అరూరి వెంకటమ్మ ఇటీవల మరణించగా శుక్రవారం వారి స్వగ్రామం ఉప్పుగల్లులోని వారి నివాసంలో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, ఐనవోలు ఆలయ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నొంటి అనిల్ రావు, హనుమకొండ జిల్లా ఆర్టీఏ సభ్యులు పల్లకొండ సతీష్, జిల్లా కాంగ్రెస్ నాయకులు జున్నపురెడ్డి రుగ్వేద్ రెడ్డి, కర్ర హరీష్ రెడ్డి, సయ్యద్ ఇంతియాజ్, ముచర్ల స్టాలిన్, ఆకుల కుమార్ తో పాటు స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

## రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**వరంగల్ వాయిస్, దామెర :** మండల కేంద్రంలోని 33/11kv సబ్ స్టేషన్లో రేపు రెండవ శనివారం నెలవారి విద్యుత్ మరమ్మతులు ఉన్నందున ఉదయం 9నుంచి 11 గంటల వరకు దామెర సబ్ స్టేషన్ పరిధిలో గల దామెర, ఓగులాపూర్, దమ్మన్నపేట్, ముస్తాలపల్లి, తక్కల్లపాడు, లాదెళ్ల, వెంకటాపూర్, సింగరాజుపల్లి గ్రామాల గృహ వాణిజ్య వ్యవసాయ పారిశ్రామిక వినియోగదారులకు విద్యుత్ అంతరాయం కలుగుతుంది. విద్యుత్ వినియోగదారులు సహకరించగలరని విద్యుత్ ఏఈ గుర్రం రమేష్ తెలిపారు.

## ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్ ను సందర్శించిన ఆర్డీఓ



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆర్డీఓ నారాయణ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వసతి గృహంలో మెనూ ప్రకారం భోజనాలు విద్యార్థులకు అందించాలన్నారు. వసతి గృహ పరిసరాలను వంట గదులను, తరగతి గదులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో జ్యోతి వరలక్ష్మి దేవి, ఆర్ఐ సంపత్, ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి, హాస్టల్ వార్డెన్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీగా నామినేషన్ వేసిన డాక్టర్ ఏలే చంద్రమోహన్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్–ఖమ్మం–నల్గొండ టీచర్ ఎమ్మెల్సీగా డాక్టర్ ఏలే చంద్రమోహన్ శుక్రవారం రిటర్నింగ్ ఆఫీసర్ కు నల్గొండ జిల్లాలో తన నామినేషన్ పత్రాలు అందజేశారు. ఉమ్మడి రాష్ట్రంలో మహబూబ్ నగర్, గుంటూరు, వరంగల్, నల్గొండ జిల్లాలలో డాక్టర్ ఏలే చంద్రమోహన్ విద్యాశాఖ అధికారిగా పనిచేశారు. తనకు ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఎదుర్కొంటున్నటువంటి సమస్యల మీద పూర్తి అవగాహన ఉందని, కాబట్టి నేను వారి సమస్యలను పరిష్కరించడానికి అహర్నిశలు కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు. కాబట్టి, కేజీబీవీపీ, మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల, యూనివర్సిటీ అధ్యాపకులు, ప్రభుత్వ జిల్లా పరిషత్ అన్ని కేటగిలకు సంబంధించిన ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అందరూ తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

## కాపాడమంటే కడుపు చేశాడు

### ఫిర్యాదు చేయడానికి వస్తే లొంగదీసుకున్నాడు

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** ఫిర్యాదు చేయడానికి పోలీస్ స్టేషన్కు వచ్చిన యువతిని మాయమాటలతో నమ్మించి ఆమెను లొంగదీసుకున్నాడు. ఈ క్రమంలోనే ఆమెపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ దారుణం మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అయితే ఈ దారుణానికి పాల్పడ్డ కానిస్టేబుల్ కు అంతకు ముందే వివాహం జరగడం ఒక ట్విస్ట్ అయితే.. చివరికి తన భార్యతో కలిసి బాధిత యువతిపై దాడి చేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారుతోంది. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళ్తే.. 31 ఏళ్లు ఉన్న బాధిత యువతి ఓ కేసులో డబ్బులు వచ్చేలా చూడాలని మేడ్చల్ పోలీస్ స్టేషన్కు ఫిర్యాదు చేయడానికి వచ్చింది. అక్కడ ఉన్న సుధాకర్రెడ్డి అనే కానిస్టేబుల్ ఆమెతో మాటలు కలిపాడు. అనంతరం ఆమెను తన ఇంటికి రప్పించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి లోబరుచుకుని అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ క్రమంలోనే పెళ్లి విషయం మాట్లాడుదామని, తన అమ్మానాన్నలకు పరిచయం చేస్తానని భార్యలేని సమయంలో ఇంటికి రప్పించి అత్యాచారం చేశాడు. ప్రతిసారి ఏదో ఒకలా ఆమెకు మాయమాటలు చెప్పి తన లైంగిక వాంఛలను తీర్చుకుంటూ పలుసార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. చివరకు బాధితురాలు గర్భం దాల్చడంతో తన నిజస్వరూపం బయటపెట్టాడు. అప్పటికే తనకు పెళ్లి జరిగిందని అబార్షన్ చేయించుకోమని సలహా ఇచ్చాడు. అంతే కాకుండా అబార్షన్కు ఒత్తిడి చేసి ఆమెతో మాత్రలు బలవంతంగా టాబ్లెట్లు మింగించాడు. మరోసారి యువతి ఇంటికి వెళ్లి బలవంతంగా ఫినాయిల్ తాగించాడు. ఆ తర్వాత మరోసారి ఆమెను ఇంటికి పిలిపించుకుని దాడి చేశాడు. అంతటితో ఆగకుండా తన భార్య సింధూజ, స్నేహితుడు కళ్యాణ్ గౌడ్లతో కలిసి ఆమెపై దాడి చేయించాడు. చివరికి తనకు జరిగిన అన్యాయంపై బాధితురాలు ఉన్నతాధికారులను ఆశ్రయించడంతో కానిస్టేబుల్ బాగోతం వెలుగులోకి వచ్చింది. ఇక ప్రస్తుతం సీపీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సుధాకర్రెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించామని పోలీసులు వెల్లడించారు. అలానే సుధాకర్రెడ్డి భార్య సింధూజ, స్నేహితుడు కళ్యాణ్ గౌడ్లపై కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు.

# అందాలతో వేడెక్కిస్తున్న మాళవిక శర్మ




మాళవిక శర్మ అంటే తెలియని సినీ అభిమాని ఉండరు. చేసింది తక్కువ సినిమాలే అయినప్పటికీ, తన గ్లామర్‌తో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది ఈ అమ్మడు. మాళవిక శర్మ 1999 జనవరి 26న ముంబైలో జన్మించింది. ఆమె న్యాయవాది కూడా. ఆమె రిజ్వీ లా కాలేజీ నుండి క్రిమినాలజీలో స్పెషలైజేషన్‌తో బ్యాచిలర్ ఆఫ్ లాస్ డిగ్రీని పొందింది. మోడల్‌గా కెరీర్ ప్రారంభించిన మాళవిక శర్మ, ఆ తర్వాత సినీ ఇండస్ట్రీలో అడుగుపెట్టింది. మాళవిక శర్మ ప్రధానంగా తెలుగు, తమిళ సినిమాల్లో నటించింది. ఆమె 2018 లో రవితేజతో కలిసి ‘‘నేల టిక్కెట్’’ చిత్రంలో నటించడం ద్వారా తెలుగు తెరకు పరిచయం అయ్యింది. ఆమె ‘‘రెడ్’’ ,’’కాఫీ విత్ కాదల్’’ ,’హరోం హర , భీమా వంటి చిత్రాలలో నటించింది.అయితే ఈ సినిమాలు బాక్సాఫీస్ పెద్దగా విజయాన్ని నమోదు చేయలేకపోయాయి. దీంతో మాళవిక శర్మ కెరీర్ అనుకున్నంతస్థాయిలో సక్సెస్ కాలేకపోయింది. మాళవిక శర్మ చేతిలో పెద్దగా సినిమాలు లేకపోయినప్పటికీ సోషల్ మీడియాలో మాత్రం చురుకుగా ఉంటుంది.మాళవిక శర్మ ఎప్పటికప్పుడు సోషల్ మీడియా ద్వారా తన అభిమానులతో టచ్‌లో ఉంటుంది. ఇదే సమయంలో తన వ్యక్తిగత విషయాలతో పాటు, తన సినిమా విషయాలను సైతం అభిమానులతో సోషల్ మీడియా ద్వారా పంచుకుంటుంది. తన లేటెస్ట్ ఫొటోలను సైతం అభిమానులకు షేర్ చేస్తుంటుంది. తాజాగా మాళవిక శర్మ తన లేటెస్ట్ ఫొటోషూట్‌ను సోషల్ మీడియాలో షేర్ చేసింది.మరోసారి తనదైన హాట్‌నెస్ అభిమానులకు కిక్ ఇచ్చింది. బ్లూ కలర్ బొట్ ఫిట్‌లో కనిపించి అదరగొట్టింది. లోపల్ బ్రా లేకుండా షట్ ఓపెన్ చేసి మరి తన అందాలను చూపించింది. ఈ ఫొటోలపై నెటిజన్లు పలు రకాలుగా స్పందిస్తున్నారు. పర్ఫెక్ట్ ఫిగర్ అని కొందరు కామెంట్స్ చేస్తుంటే, అన్ని మాకే చూపిస్తే రేపు పెళ్లి అయిన తర్వాత నీ భర్తకు ఏం చూపిస్తావు అంటూ మరి కొందరు కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం మాళవిక శర్మ బ్రాలెస్ ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి.



# ఇక తెరపైకి మోక్షజ్ఞ

నందమూరి బాలకృష్ణ వరుసగా సినిమాలు చేస్తూనే మొన్నటివరకు అన్ స్టాపబుల్ షో చేశారు. దీంతోపాటు తన తనయుడు మోక్షజ్ఞను వెండితెరకు పరిచయం చేసే పనుల్లో బిజీగా ఉన్నారు. పద్మభూషణ్ అవార్డు అందుకున్న తర్వాత రెట్టించిన ఉత్సాహంతో ఉన్న బాలయ్య తన కొడుకును స్టార్ హీరోగా తీర్చిదిద్దాలంటే తొలి సినిమాగా ఎటువంటి నిర్ణయం తీసుకోవాలనే యోచనలో ఉన్నారు. అయితే ఈ సినిమాకు సంబంధించిన అప్ డేట్ తాజాగా వచ్చింది. ప్రీ ప్రొడక్షన్ పనులన్నీ పూర్తిచేసుకొని త్వరలోనే సెట్స్ పైకి అడుగుపెట్టబోతోంది. ప్రశాంత్ వర్మ ఈ సినిమాను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని దర్శకత్వం వహించనున్నారని, బాలయ్య తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడాలనే ప్రయత్నాల్లో ఉన్నారని వార్తలు వస్తున్నాయి. ఈ సినిమాకు నిర్మాత ఎవరు అనేది ఇంకా ఖరారు కాలేదు. ఆమె అయితే మోక్షజ్ఞ సరసన బాగుంటుందంటున్నారు మోక్షజ్ఞ సరసన హీరోయిన్ గా శ్రీలీల నటిస్తుందని గతంలో వార్తలు వచ్చాయి. అయితే శ్రీలీల వద్దని, మీనాక్షి చౌదరి అయితే బాగుంటుందంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. గోట్, లక్కీ భాస్కర్, సంక్రాంతికి వస్తున్నాం సినిమాలతో బ్లాక్ బస్టర్లను అందుకుందని, తను మోక్షజ్ఞ సరసన హీరోయిన్ అయితే వీరిద్దరి కాంబినేషన్ అదిరిపోతుందని అంటున్నారు. దీనికి సంబంధించిన ఓ పోస్ట్ సామాజిక మాధ్యమాల్లో వైరలవుతోంది. చాలామంది అభిమానులు మాత్రం హీరోయిన్ గా మీనాక్షి చౌదరినే ఖరారు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ సినిమా తర్వాత రెండో సినిమాను కూడా బాలయ్య సిద్ధం చేసివుంచారు.



# పెళ్లి చేసుకోవద్దు


ఇప్పుడే సినిమాకు విన్నా.. సంగీత దర్శకుడు తమన్ పేరే వినబడుతోంది. మ్యాగ్జిమమ్ స్టార్ హీరోలందరి చిత్రాలకు తమన్ వాయిస్తున్నాడు. అంత బిజీగా ఉన్నా కూడా ఎప్పుడూ వర్క్ టెన్షన్‌ని తన ఫేస్‌లో కనబడనివ్వకుండా.. నవ్వుతూ ఉండే తమన్ తాజాగా జరిగిన ఓ ఇంటర్వ్యూలో లైఫ్ స్టైల్, స్ట్రెస్ గురించి మాట్లాడాడు. అలాగే నేటి తరం గురించి మాట్లాడుతూ.. సెన్సేషనల్ కామెంట్స్ చేశారు. తమన్ మాట్లాడుతూ.. ‘ఇప్పుడు అమ్మాయిలు ఇండిపెండెట్ అయ్యారు.. ఒకరి మీద వాళ్లు బతకాలని అనుకోవడం లేదు.. సోషల్ మీడియా ప్రభావం ఎక్కువైంది.. ఇన్‌స్టాగ్రాం వాడకం ఎక్కువైంది.. జనాల మైండ్ సెట్ మారింది.. కలిసి ఉండే ఆలోచనాధోరణి మారిపోయింది.. పెళ్లి చేసుకున్నా కూడా వెంటనే విడిపోతోన్నారు.. అందుకే నేను ఈ పెళ్లిళ్లు ఇప్పుడు వేస్ట్ అంటున్నాను.. నన్ను ఎవరైనా సలహా అడిగితే మాత్రం పెళ్లి వద్దు అనే అంటాను’ అని చెప్పుకొచ్చాడు.మరోవైపు ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తలసేమియా వ్యాధి క్యాంపులకు తల సేమియా వ్యాధి గ్రస్తుల చికిత్స కోసం తమన్ ఫండ్ రైజింగ్ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ‘‘లైఫ్ లో దేన్నైనా నిలబెట్టవచ్చు. ట్రస్ట్ ను నిలబెట్టడం చాలా కష్టం. ఎన్టీఆర్ గారు చంద్రబాబు గారు ఎంతోమందికి స్ఫూర్తివంతులు. వారు స్థాపించిన ట్రస్ట్ కార్యక్రమంలో నేను పార్టిసిపేట్ చేయడం గర్వంగా ఉంది. చంద్రబాబు నాయుడు గారి చేసిన అభివృద్ధి ఏంటో మనం చూశాం. ఫిబ్రవరి 15న విజయవాడ లో జరిగే ఈవెంట్ లో ఎన్టీఆర్ గారి ఉత్తమ పాటలు ఉంటాయి. మా టీమ్ మెంబర్స్ ప్రిపేర్ అవుతున్నాం’’ అని తమన్ అన్నారు.



# లవ్‌యాపా అంటూ వస్తోన్న ఖుషీ కపూర్

’లవ్‌యాపా’ అంటూ యూత్‌ఫుల్ లవ్‌స్టోరీతో పలకరించనున్నారు ఖుషీ కపూర్. ఆమె ప్రధానపాత్రలో నటించిన ఈ చిత్రం ఫిబ్రవరి 7న విడుదల కానుంది. తాజాగా ఈ చిత్రబృందానికి విషెస్ చెప్పిన జాన్వీకపూర్ తన చెల్లి ఖుషీని చూస్తుంటే గర్వంగా ఉందన్నారు. ‘ఎంత కష్టమైనప్పటికీ నీకు నచ్చిన దాన్ని చాలా నిజాయితీగా, శ్రద్ధగా చేస్తున్నందుకు నిన్ను చూస్తుంటే ఎంతో గర్వంగా ఉంది ఖుషీ. వినోదం, హాస్యంతో పాటు ఎమోషనల్ సన్నివేశాలతో కూడిన ఈ రొమాంటిక్ కామెడీ చిత్రం 7 నుంచి అన్ని థియేటర్‌లలో సందడి చేస్తుంది. నేను ఈ సినిమా చూసి కచ్చితంగా భావోద్వేగానికి గురవుతాను. ’లవ్‌యాపా’ స్పెషల్ టీ షర్ట్ వేసుకున్న జాన్వీ.. తన సినిమాల విడుదల తేదీలలో ఖుషీని కూడా తన ఫొటో ఉన్న టీ షర్ట్ ధరించాలని కోరారు. 2023లో ’ది ఆర్చీస్’తో హీరోయిన్‌గా ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చారు ఖుషీ కపూర్ . ఆ చిత్రంతో ప్రశంసలు అందుకున్నారు. ఇప్పుడు ’లవ్‌యాపా’ అంటూ పలకరించేందుకు సిద్ధమయ్యారు. ఇప్పుడిదే చిత్రానికి రీమేక్‌గా ’లవ్‌యాపా’ సిద్ధమైంది. అద్వైత్ చందన్ దర్శకత్వం వహించారు. ప్రదీప్ రంగనాథన్ నిర్మాతగా వ్యవహరించారు.

# సామ్.. చాలా దురదుష్టవంతురాలు



యువ సామ్రాట్ అక్కినేని నాగచైతన్య ప్రస్తుతం గీత ఆర్ట్స్ బ్యానరులో అల్లు అరవింద్ భారీ బడ్జెట్ తో నిర్మించిన తండేల్ సినిమా థియేటర్లలో విడుదలై మంచి టాక్ తెచ్చుకుంది. తాజాగా ఈ సినిమా గురించి అక్కినేని కొత్త కోడలు శోభిత ధూళిపాళ సామాజిక మాధ్యమంలో పోస్ట్ పెట్టింది. ఈ సినిమా కోసం తాను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని, థియేటర్లలో ఈ సినిమా కచ్చితంగా చూస్తానని చెప్పింది. కొత్త కోడలుగా అక్కినేని కుటంబంలో మంచిపేరు తెచ్చుకుంది. వివాహమైన తర్వాత ఇటీవలే తొలిసారిగా ఈ జంట బయట దర్శనమిచ్చింది. నాగచైతన్య–శోభిత చాలా సంతోషంగా ఉన్నారని దీన్నిబట్టి అర్థమవుతోందని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. అక్కినేని లాంటి పెద్ద కుటుబంలోకి కోడలిగా అవకాశం వస్తే సమంత చాలా దురదృష్టవంతురాలై దాన్ని పోగొట్టుకుందంటూ వ్యాఖ్యానిస్తున్నారు. ఏదేశమైనప్పటికీ శోభిత ధూళిపాళ చాలా అదృష్టవంతురాలంటున్నారు.



8
WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
శుక్రవారం, ఫిబ్రవరి 07, 2025

# ప్రారంభమైన మహా కుంభాభిషేకం

- తరలి వస్తున్న భక్తులు
- పనులను పర్యవేక్షించిన కలెక్టర్
- ముగింపు కార్యక్రమానికి పోటెత్తనున్న భక్తజనం



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవాలయంలో మహా కుంభాభిషేక మహోత్సవాలు శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభం అయ్యాయి. పండితుల మంత్రోచ్చారణల మధ్య అరుదైన ఘట్టానికి శ్రీకారం చుట్టారు. మహా పట్టాభిషేకం, కుంభాభిషేక పూజలను కన్నుల పండువగా నిర్వహించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ తో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటించారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమాలో 9వ తేదీ మహా కుంభాభిషేకం ముగింపు సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చే అవకాశం ఉన్నందున రద్దీకి తగినట్లు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో గోదావరి ఘాట్ వద్ద స్నాన ఘట్టాలు పరిశీలించిన కలెక్టర్, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. భక్తుల వాహనాలను గోదావరి ఘాట్ వద్దకు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి కేటాయించిన పార్కింగ్ ప్రాంతాల్లోనే వాహనాలను నిలిపేలా చర్యలు చేపట్టాలన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణకు 70 మంది పారిశుధ్య కార్మికులతో ప్రత్యేక పరిశుభ్రత చర్యలు చేపట్టినట్లు తెలిపారు. దీని పర్యవేక్షణ బాధ్యతలను జిల్లా పంచాయతి అధికారి, డివిజనల్ పంచాయతి అధికారి, ఎంపీడీఓ, ఎంపీఓలకు అప్పగించారు. రెండు ట్యాంకర్ల ద్వారా ఆలయ పరిసర ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యం కల్పించామని, అలాగే ప్రధాన కూడళ్లల్లో కూడా మంచినీటి సరఫరా చేపట్టినట్లు వెల్లడించారు. అత్యవసర వైద్య సేవలకోసం ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. వైద్యాధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. మహాదేవపూర్ లోని కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంలో బెడ్లు కేటాయించినట్లు తెలిపారు. భక్తులు గోదావరిలోకి వెళ్లకుండా నియంత్రణ చేయాలని ఆదేశించారు. నిరంతర గస్తీ ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనకు తావులేకుండా పటిష్ట పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. నిర్దేశిత ప్రాంతం దాటి భక్తులు గోదావరిలోకి వెళ్లకుండా నియంత్రణ చేయాలని, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. 9వ తేదీన ఆలయ ప్రధాన ద్వారం వద్దకు భక్తులు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉందని అందుకు తగినట్లుగా బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ నారాయణ రావు, మండల ప్రత్యేక అధికారి వీరభద్రయ్య, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, దేవస్థానం ఈఓ మహేష్, ఇరిగేషన్, ఆర్ డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# కనీస ధర కరువాయే..

- నిండా మునుగుతున్న మిర్చి రైతులు
- మద్దతు ధర రూ.25 వేలు ప్రకటించాలి
- మార్క్ ఫెడ్, నాఫెడ్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయాలి
- రైతు సంఘం నాయకుల డిమాండ్



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటకు మార్కెట్ లో గిట్టుబాటు ధర లభించక రైతులు నిండా మునుగుతున్నారని అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్, తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు సోమిడి శ్రీనివాస్ ఆరోపించారు. వ్యాపారుల కబంధహస్తాల్లో మార్కెట్లు నడుస్తోందని, వారికి మార్కెట్ అధికారులు అండగా నిలుస్తున్నారని విమర్శించారు. అఖిలభారత రైతు సమాఖ్య, తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రతినిధి బృందం స్థానిక ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ ను సందర్శించి రైతుల పంటల కొనుగోలు పరిస్థితి, కనీస వసతులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పెద్దారపు రమేష్, సోమిడి శ్రీనివాస్ మాట్లాడుతూ ఏనుమాముల మార్కెట్ రైతుల పంటల దోపిడీకి అడ్డగా మారిందన్నారు. వ్యాపారుల కనుసనల్లో మార్కెట్ వ్యవస్థ నడుస్తున్నదని వ్యాపారులందరు సిండికేట్ గా మారి లాభాలను దృష్టిలో పెట్టుకొని పంటల ధరలను నిర్ణయిస్తూ జెండా పాట పెడుతున్నారన్నారు. కనీసం ఆ జెండా పాట అయినా రైతులందరికీ ఉత్పత్తులకు వర్తింప చేయకుండా కుంటి సాకులతో మోసం చేస్తున్నారని ఆరోపించారు. తామే మార్కెట్ వ్యవస్థ అన్నట్లు వ్యవహరిస్తున్నారని వారికి మార్కెటింగ్ అధికారులు అండగా నిలుస్తున్నారన్నారు. రైతు సంఘాలు రైతులకు అండగా నిలవకుండా మార్కెట్ సందర్శించకుండా అనేక ఆంక్షలు విధిస్తున్నారని మండిపడ్డారు. ఈ క్రమంలో మిర్చి రైతులు ఎకరానికి లక్ష రూపాయలు పెట్టుబడి పెట్టి పంట పండించి మార్కెట్ కు తీసుకువస్తే అంతర్జాతీయంగా మిర్చి పంటకు డిమాండ్ ఉన్నప్పటికీ ఎనుమాముల మార్కెట్లో మాత్రం కేవలం రూ.13,400 క్వింటాకు జెండా పాట పాడి ఆచరణలో ఎనిమిది వేలకు మించి కొనుగోలు చేయడం లేదని విమర్శించారు. దీంతో రైతులకు కూలీలకు సరిపడా డబ్బులు సైతం వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం నూతన వ్యవసాయ మార్కెటింగ్ చట్టాన్ని అమలు చేస్తే రైతుల పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతుందని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే మార్క్ ఫెడ్, నాఫెడ్ ద్వారా మిర్చి కొనుగోలు చేయించి కనీస మద్దతు ధర కింటాకు రూ.25వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. నూతన వ్యవసాయ మార్కెట్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. మార్కెట్ లో కనీస వసతుల కల్పించాలని, మార్కెట్ దోపిడీని అరికట్టి శాస్త్రీయ పద్ధతిలో పంటల ధరల నిర్ణయించాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక మార్కెట్ కార్యదర్శి పోలేపాక నిర్మలకు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఏఐకేఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్ రెడ్డి హంసా రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎండి ఇస్మాయిల్, సహాయ కార్యదర్శి గోనె రామచందర్, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఓదెల రాజన్న, జిల్లా కోశాధికారి ఊరటి హంసల్ రెడ్డి, ఏఐకేఎఫ్ జిల్లా నాయకులు ఐతమ్ నాగేష్, జక్కుల అశోక్, అప్పనపురి నరసయ్య, మాలి ప్రభాకర్, పరిమళ గోవర్ధన్, రాజు, తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఊకంటి గోపాల్ రెడ్డి, లడె మోహన్ రావు, బొల్లు ఎల్లయ్య, రాములు, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# 9న శ్రీ భక్త మార్కండేయ సేవా సంఘం ప్రథమ సర్వసభ్య సమావేశం

- ముఖ్య అతిథులుగా హాజరు కానున్న కేశవమూర్తి, నాగరాజు





**వరంగల్ వాయిస్, హనుమకొండ :** శ్రీ భక్త మార్కండేయ సేవా సంఘం ప్రథమ సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం ఉదయం 11 గంటలకు న్యూ శాయంపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న లయన్స్ క్లబ్ బిల్డింగ్ లో నిర్వహించనున్నట్లు కేఎల్ఎన్ రెడ్డి కాలనీలోని శ్రీ భక్త మార్కండేయ సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీనియర్ జర్నలిస్ట్, వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు విచ్చేయనున్నట్లు ప్రకటించారు. సర్వసభ్య సమావేశం సందర్భంగా పద్మశాలి ముద్దుబిడ్డ, సింగర్ గా గుర్తింపు పొంది ప్రపంచ రికార్డు సాధించిన సనశ్రీతోపాటు ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందిన మిమిక్రీ కళాకారుడు బొమ్మ శ్రీనివాస్, స్టాఫ్ నర్స్ గా విధులు నిర్వహిస్తూనే ఎంబీబీఎస్ సాధించిన పద్మశాలి ముద్దు బిడ్డ సంధ్యను ఘనంగా సన్మానించనున్నట్లు వెల్లడించారు. అదే విధంగా సంఘ సభ్యుడైన డాక్టర్ విద్యం గౌతమ్ కు చెందిన హనుమకొండలోని అభయ హాస్పిటల్ ఆధ్వర్యంలో మొదటి సంవత్సరం పుస్తకాలకోసం ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. కళాకారులకు సన్మాన కార్యక్రమం అనంతరం పరపతి సంఘం ఆదాయ వివరాలు సమర్పణ ఉంటుందన్నారు. అనంతరం భోజనం ఏర్పాట్లు చేసినట్లు ప్రకటించారు.

# డీటీసీ ఇంట్లో ఐటీ సోదాలు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ డీటీసీ పుప్పాల శ్రీనివాస్ ఇంట్లో శుక్రవారం ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఆదాయానికి మించి ఆస్తు లు ఉన్నాయని ఆరోపణల నేపథ్యంలో ఈ సోదాలు చేస్తున్నట్లు సమాచారం. అదే విధంగా ఏక కాలంలో హైదరాబాద్, కరీంనగర్, జగిత్యాలలోని శ్రీనివాస్ బంధువుల ఇళ్లల్లో కూడా ఏసీబీ అధికారుల సోదాలు నిర్వహించారు. పక్క సమాచారంతో సోదాలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులకు విస్తుపోయే విషయాలు తెలిసినట్లు సమాచారం. సోదాల సందర్భంగా నగదుతో పాటు బంగారం, వెండి ఆభరణాలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలసింది. అయితే లెక్కకు మించిన ఆస్తులున్నట్లు ఏసీబీ సోదాల్లో వెల్లడయినట్లు ప్రచారం సాగుతోంది. రూ.50 కోట్లకు పైగా ఆస్తులను శ్రీనివాస్ కూడబెట్టినట్లు ఏసీబీ విచారణలో వెల్లడైనట్లు సమాచారం.




# పన్నులు చెల్లించండి

- బల్దియా అదనపు కమిషనర్ జోనా

**వరంగల్ వాయిస్, వరంగల్ :** నిర్ణీత సమయంలో పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని బల్దియా అదనపు కమిషనర్ జోనా కోరారు. బల్దియా పరిధి హంటర్ రోడ్ లోగల కాసం ఫ్యాషన్స్ యాజమాన్యం ఆస్తి పన్ను రూ.11,09,164 పన్ను చెల్లింపునకు సంబంధించిన చెక్ ను సదరు యాజమాన్యం శుక్రవారం అదనపు కమిషనర్ కు అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ నగర పరిధిలోని వివిధ వాణిజ్య సంస్థలు, గృహ మజమానులు వారి ప్రాపర్టీ పన్నులు విధిగా చెల్లించి కార్పొరేషన్ కు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, రెవెన్యూ అధికారి షెహజాది బేగం, ఆర్ఐ లింగమూర్తి పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com